శ్లో. పుత్రైః పిత్రోస్తు సంస్కారః ప్రమాదాదకృతో యది.

జ్ఞాతీనాం దశరాత్రం స్యాత్తదూర్ధ్వం సూతకం న హి..

నిత్యకర్మాణి కుర్వీత స్మృత్యుక్తాని తథైవ చ.

వైద్యనాథదీక్షితీయము– 691 పేజీ.

అర్థము–తల్లిదండ్రులమరణానంతరము పుత్రులచేత వారి అన్త్యేష్టి–సంస్కారము దశాహములోపల చేయబడనిచో సపిండులచే దశాహపర్యంతము ఆశౌచము అనుష్ఠింపబడిన తదనంతరము వారికి ఆశౌచము ఉండదు. నిత్యకర్మలు అగు వైశ్వదేవాదులు, స్మృత్యుక్తములు (గృహ్యోక్తములు) అగు పుంసవనాదికర్మలు వారు చేసుకొనవచ్చును అనునది పై ప్రమాణవచనార్థము.

శ్లో. వంశజానామసంస్కారే ఆశౌచం తు కథం భవేత్.

దశాహాత్పరతశ్శుద్ధిర్జ్ఞాతీనాం చ విశేషతః..

ఆశౌచశతకవ్యాఖ్యానము –31 పేజీ

అర్థము– తన వంశములో మరణించినవారికి సంస్కారము దశాహములోపల చేయబడకపోయినచో ఆశౌచమును సంస్కారము పూర్తి అగునంతవరకు అనుష్ఠించవలెనా లేక దశాహము వరకు ఆశౌచమును అనుష్ఠించినచో శుద్ధి అగునా అను సంశయమున దశాహానంతరము సపిండులందరికినీ విప్రో శుద్ధ్యేద్దశాహేన ఇత్యాది వచనములచే ఆశౌచశుద్ధి కులుగును. వారు మళ్ళీ దశాహము ఆశౌచధర్మములు ఆచరించరాదని పై వచనముయొక్క అర్థము.

ఉదా– ఒక వ్యక్తి దేశాంతరమందు మరణించినాడు. అతని శరీరమును స్వదేశమునకు తీసుకొని వచ్చుటకు ఆలస్యమైనది. 15 రోజుల తర్వాత స్వదేశమునకు తీసుకుని రాబడినిది. ఈ లోపున సపిండులకు అతని మరణవార్త

తెలిసినది. వారందరూ దశాహపర్యంతము ఆశౌచము అనుష్ఠించినారు. ఇపుడు 16 వ రోజున ఆవ్యక్తికి అన్త్యేష్టిసంస్కారము చేయబడుచున్నది కావున మళ్ళీ ఆశౌచము సపిండులకు ఉండునా లేక పూర్వాశౌచానుష్ఠానముతోనే శుద్ధి జరుగునా అను సందేహమున పై వచనముచే పూర్వాశౌచానుష్ఠానముతోనే వారికి శుద్ధి. దహనదినమందు వీరందరూ శ్మశానమునకు వెళ్ళుట, ధర్మోదకములు మొదలగు కర్మలయందు (జ్ఞాతికర్తవ్యముగా చేయు కర్మలయందు) వీరికి కర్మాంగాశౌచమనునది మాత్రము ఉండును. అనగా ధర్మోదకములు ఇచ్చునపుడు అంతవరకే ఆశౌచమనునది ఉండును.

వా– ముఖ్యకర్తృవ్యతిరిక్తజ్ఞాతీనాం దశాహోత్వరం ప్రేతకార్యాకరణేపి శుభకర్మ కార్యమితి గమ్యతే. ఆశౌచశతకవ్యాఖ్యానము –31 పేజీ

అర్థము– పై వచనములచేత ముఖ్యకర్తకంటే వ్యతిరిక్తులగు అనగా సపిండులు దశాహానంతరము ప్రేతకార్యము చేయబడకపోయిననూ అవశ్యకర్తవ్యములగు శుభకర్మలు చేయవచ్చునని తెలియుచున్నది.

పై ప్రమాణములచే సపిండులకు దశాహానంతరము ఏ విధమైన ఆశౌచము ఉండదని తెలియబడుచున్నది. కావున వారికి సంవత్సరసూతకము అనునది వర్తించదు. ఇంకనూ ప్రమాణములు స్మృతిచంద్రిక, వీరమిత్రోదయము, విధానపారిజాతము, వైద్యనాథీయ, త్రింశచ్ఛ్లోకీ, నిర్ణయామృతము మొదలగు గ్రంథములయందు చూడదగును.